


సోయాబీన్‌కే మొగ్గు
యాసంగిలో రైతులు సోయాబీన్ సాగుపై ఆసక్తి చూపారు. మార్కెట్‌లో మంచి ధర ఉండడంతో జహీరాబాద్ ప్రాంతంలో అత్యధికంగా సాగు చేస్తున్నారు. 8లో..



ఐపీఎల్ బెట్టింగ్.. అరెస్ట్
ఐపీఎల్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. 8లో..



సమన్వయంతో సమస్యల పరిష్కారం
అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే సమస్యలు పరిష్కారమవుతాయని మర్కూర్ ఎంపీపీ పాండుగౌడ్ అన్నారు. 9లో..



న్యూస్‌రీల్

ఆత్మగౌరవ భవనాలకు నిధులు

రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు



సిద్దిపేటజోన్: సీఎం కేసీఆర్ అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యం ఇస్తున్నారని, గిరిజన, బంజారాల భవన్ నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు తెలిపారు. సిద్దిపేట నియోజకవర్గ గిరిజన, బంజారా భవన్‌కు రూ.2 కోట్లు, హుస్నాబాద్‌లో కోటి నిధులతో నిర్మిస్తున్న గిరిజన, బంజారా భవన్‌కు మరో రూ.2కోట్లు మంజూరైనట్లు తెలిపారు. త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి అధునాతన హంగులతో నిర్మాణం చేపడతామని, ఐదు నెలల్లో అందుబాటులోకి తెస్తామని తెలిపారు.

పాత ప్లాన్‌ను కొనసాగించాలి

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



కేంద్రమంత్రి గడ్కరీకి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు, రైతులు

దుబ్బాకటౌన్: ఎల్కతుర్తి–సిద్దిపేట–మెదక్ జాతీయ రహదారి 765 డీజీకి సంబంధించి అధికారులు చేపట్టిన కొత్త ప్లాన్‌తో రైతులు విలువైన భూములు కోల్పోతున్నారని, పాత ప్లాన్ ప్రకారమే కొనసాగించాలని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల రైతులతో కలిసి సోమవారం ఢిల్లీలో కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి విన్నవించారు. కొత్త సవరణతో మరింత భూమి పోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారని కేంద్ర మంత్రికి వివరించారు. పాత ప్లాన్ ప్రకారమే జాతీయ రహదారి నిర్మాణం చేపట్టి భూములు కోల్పోతున్న రైతులకు తగిన నష్టపరిహారం అందించాలని కోరారు. న్యాయం జరిగేలా చూస్తానని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు.

వసూళ్లకు పాల్పడిన సురేశ్‌పై చర్య తీసుకోవాలి

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గీస భిక్షపతి

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్ నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బూర్గు సురేశ్‌పై చర్య తీసుకోవాలని ఆలయ చైర్మన్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గీస భిక్షపతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రులు శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ ముందుకు వచ్చి సహకరించడంతో గుట్టపై సుమారు రూ.5కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టగా, డబ్బులిస్తేనే పనులు చేయనిస్తా.. అంటూ బూర్గు సురేష్ గౌడ్ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ రఘువీర రెడ్డిని బెదిరిస్తూ మాట్లాడిన ఆడియోను విలేకరుల సమావేశంలో బహిర్గతం చేశారు. అభివృద్ధి పనులను అడ్డుకుంటూ ఆలయ ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీపీ తలారి కీర్తన, జెడ్పీటీసీ సిద్దప్ప, సర్పంచ్‌లు స్వామి గౌడ్, కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఓర్వలేకే ఆరోపణలు

బూర్గు సురేష్ గౌడ్

కొమురవెల్లి(సిద్దిపేట): రాజకీయంగా నా ఎదుగుదల చూసి ఓర్వలేకే బీఆర్‌ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బూర్గు సురేష్ గౌడ్ అన్నారు. కాంట్రాక్టర్ వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాడని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపణల నేపథ్యంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు తనపై బురదజల్లే కార్యక్రమానికి తెరలేపారని, తాను ఎవరి నుంచి డబ్బులు వసూలు చేయలేదన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు విడుదల చేసిన ఆడియోకు తనకు సంబంధం లేదని తెలిపారు. ఆలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వద్ద డబ్బులు వసూలు చేసిన ఘనత భిక్షపతికే దక్కుతుందన్నారు.

భౌ బౌ కుక్కలు

- కలెక్టరేట్ క్వార్టర్స్‌లో శునకాల వీరంగం
- వాకింగ్ చేస్తున్న ఓ అధికారిపై దాడి
- వెంటపడటంతో గాయపడిన మహిళ
- భయాందోళనలో కుటుంబసభ్యులు



కలెక్టరేట్ సమీపంలో సంచరిస్తున్న కుక్కలు

సాక్షి, సిద్దిపేట: జిల్లా అధికారులు నివాసముండే అధికారిక గృహ సముదాయంలో వీధి కుక్కలు బీభత్సం సృష్టిస్తున్నాయి. కలెక్టరేట్ క్వార్టర్స్‌లో శునకాల సంచారం అధికారులు, కుటుంబ సభ్యులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. కర్ర లేనిదే బయటకు రాలేని పరిస్థితి. ప్రజలకు రక్షణ కల్పించే అధికారులకే కుక్కల బెడద తప్పడం లేదు. క్వార్టర్స్ చుట్టూ ప్రహరీ లేకపోవడంతో స్వేచ్ఛగా స్వైర విహారం చేస్తూ దాడులకు తెగబడుతున్నాయి.

నివాస పరిసరాల్లో సంచారం

- దుద్దెడ సమీపంలో కలెక్టరేట్‌కు వెనుక భాగంలో జిల్లా అధికారుల కోసం నివాస సముదాయాలు ఏర్పాటు చేశారు.
- జిల్లా అధికారులకు రెండు బ్లాక్‌లు, కలెక్టర్, అదనపు కలెక్టర్‌లకు వేర్వేరుగా భవనాలు నిర్మించారు.
- ఇందులో కలెక్టర్, అదనపు కలెక్టర్, ట్రైనీ కలెక్టర్, డీపీఓ, బీసీ సంక్షేమ శాఖ అధికారి, పశు సంవర్ధక శాఖ అధికారి, డీఆర్‌డీఓలతో పాటు ఇతర అధికారులు నివాసం ఉంటున్నారు.
- కాగా ఈ సముదాయాల ఆవరణంలో సంచరిస్తున్న వీధి కుక్కలు వీరంగం సృష్టిస్తున్నాయి.
- ఈ నెల 1న శనివారం సాయంత్రం వాకింగ్ చేస్తున్న ఓ అధికారి తొడ, కాలు మడికట్టు దగ్గర కరవడంతో ఆస్పత్రికి తీసుకువెళ్లారు. వైద్యుల పర్యవేక్షణలో ఐసీయూలో ఉంచి చికిత్స అందించి, బలమైన గాయం కావడంతో తొడ భాగంలో రెండు కుట్లు సైతం వేశారు.
- పది రోజుల క్రితం ఓ ట్రైనీ అధికారి సతీమణి బయటకు వెళ్లగా కుక్కలు వెంట పడ్డాయి. ఆందోళన చెంది పరుగెత్తడంతో కింద పడింది. క్వార్టర్స్‌లో ఉండే వారు సకాలంలో స్పందించడంతో ప్రమాదం తప్పి కాలుకు స్వల్ప గాయమైంది.
- 15రోజుల క్రితం ఓ ప్రధాన అధికారి ఇంట్లో పెంచుకుంటున్న కుక్కపై వీధి కుక్కలు దాడిచేశాయి.
- బంగ్లాలో ఉండే ఓ వీఆర్‌ఏను సైతం కుక్కకాటు బాధితుడిగా తెలిసింది.
- అధికారిక నివాసాల్లో కుక్కల దాడులతో అధికారులు వారి కుటుంబ సభ్యులు భయాందోళన చెందుతున్నారు.
- కలెక్టరేట్, సీపీ కార్యాలయాలకు చుట్టూ ప్రహరీ లేకపోవడంతో చుట్టుపక్కల నుంచి వచ్చిన కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయి.
- జిల్లాలో సగటున ఏదో చోట 15 నుంచి 18 మందిని కుక్కలు కరుస్తున్నట్లు తెలుస్తోంది.
- క్వార్టర్ల చుట్టూ ప్రహరీ నిర్మిస్తే వీధి కుక్కల బెడదను నియంత్రించే అవకాశం ఉంటుందని కోరుతున్నారు.

గత ఐదేళ్లలో నమోదైన కేసుల వివరాలు

సంవత్సరం	బాధితులు
2019	6,805
2020	4,625
2021	6,062
2022	5,628
2023	980

(జనవరి నుంచి ఇప్పటి వరకు)

తొలిరోజు 99.93 శాతం



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

- ప్రశాంతంగా 'పది' పరీక్షలు
- 14,174 మంది విద్యార్థులు హాజరు
- తొమ్మిది మంది గైర్హాజరు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా వ్యాప్తంగా సోమవారం జరిగిన పదో తరతగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 84 పరీక్ష కేంద్రాల్లో 14,174 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఉదయం 9.30గంటలకు ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వద్దకు చేరుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు కేంద్రాల వద్దకు రావడంతో సందడి వాతావరణం కన్పించింది. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు, అవకతవకలు లేకుండా విద్యాశాఖ అధికారులు ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకున్నారు. అన్ని కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్‌లు తదితర మౌలిక సౌకర్యాలు కల్పించారు. పోలీస్‌లతో భద్రత ఏర్పాటు చేశారు. మొత్తం 14,183 మంది విద్యార్థులకు గాను 14,174, మంది హాజరు కాగా, 9 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 99.93శాతం హాజరు నమోదైంది. రూట్ ఆఫీసర్స్, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్, చీఫ్ కస్టోడియన్, జాయింట్ కస్టోడియన్, చీఫ్ సూపరింటెండెంట్, జాయింట్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులు పర్యవేక్షించారు. జిల్లా కేంద్రంలోని పరీక్ష కేంద్రాల్లో జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, అడిషనల్ డీసీపీ మహేందర్ పర్యటించి, పరీక్ష తీరును పరిశీలించారు.



పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ మహేందర్

ప్రజావాణికి 63 దరఖాస్తులు

- ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి
- డీఆర్‌ఓ లక్ష్మీ కిరణ్

సిద్దిపేటరూరల్: వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చిన అర్జీల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీకిరణ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో పలువురి నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు నమ్మకంతో సమస్యలు విన్నవించుకునేందుకు ప్రజావాణికి వస్తారని, వారికి సకాలంలో న్యాయం చేయాలని సూచించారు. భూసంబంధిత, డబుల్ బెడ్రూం ఇళ్లు, ఆసరా పింఛన్లు మొత్తం కలిపి దరఖాస్తులు 63 వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ అబ్దుల్ రహమాన్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో లక్ష్మీకిరణ్

మా భూమి ఇప్పించండి



నా పేరు వనం పోచయ్య. దుబ్బాక మండలం చీకోడు గ్రామం. నాతో పాటు నా తమ్ముడు నర్సయ్యకు సర్వే నంబర్ 1183/ఇలో 10 గుంటల భూమి ఉంది. 20 ఏళ్లగా సాగు చేస్తున్నాం. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కబ్జా చేసి, అతడి పేరు మీద పట్టా చేయించుకున్నాడు. ఈ విషయమై అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదు. ఉన్నతాధికారులు స్పందించి భూమిని ఇప్పించండి.

– వనం పోచయ్య, చీకోడు

వక్ఫ్ భూములను కాపాడండి



నంగునూరు మండలంలో గ్రామానికి ఆనుకొని ఉన్న విలువైన వక్ఫ్ భూములను కొందరు ఆక్రమించారు. ఈ భూముల్లో మాపూర్వికుల సమాధులు ఉన్నాయి. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు వినతి పత్రం అందించాం. అయినా ఎలాంటి స్పందనలేదు. రెవెన్యూ అధికారులు సర్వే చేసి ఆక్రమణలను తొలగించాలి.

– నంగునూరు గ్రామ ముస్లింలు



సూచనలు చేస్తున్న కలెక్టర్

పనులు త్వరగా పూర్తి చేయాలి

మర్కూక్(గజ్వేల్): సమీకృత భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అధికారులకు సూచించారు. సోమవారం మండల కేంద్రమైన మర్కూక్‌లో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనం, సమీకృత కార్యాలయ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, రెండు నెలల్లోపు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అనంతరం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. రోజువారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో గడా అధికారి ముత్యంరెడ్డి, సర్పంచ్ భాస్కర్, ఎంపీపీ పాండుగౌడ్, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలం లకుడారంలో కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం కలెక్టరు ప్రశాంత్‌జీవన్ పాటిల్ పరిశీలించారు. పథకం అమలు తీరుపై మంగళవారం సీఎస్ శాంతి కుమారి, రాష్ట్ర హెల్త్ అండ్ కమిషనర్ శ్వేత పరిశీలించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించారు. కౌంటర్ల ఏర్పాటుపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. క్యాంపులో ప్రజలు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యేలా చూడాలన్నారు. జిల్లా వైద్యాధికారి కాశీనాథ్, సర్పంచ్ కనుకవ్వ, క్వాలిటీ కంట్రోలింగ్ ఆఫీసర్ రాకేష్, వైద్యులు బల్‌బీర్ సింగ్, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ఆరోగ్య మహిళా కేంద్రం సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

- కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్
- సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రి, బస్తీ దవాఖానా సందర్శన

సిద్దిపేటకమాన్: ఆరోగ్య మహిళ కేంద్రంలో ప్రతీ మంగళవారం నిర్వహించే వైద్య సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ సూచించారు. సోమవారం సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మహిళా ఆరోగ్య సెంటర్‌ను, ఇందిరమ్మ కాలనీలో బస్తీ దవాఖానాను సందర్శించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, మెరుగైన సేవల కోసం సిద్దిపేట జీజీహెచ్‌కు పంపించాలన్నారు. అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని, మహిళలకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. డీఎంహెచ్ఓ డాక్టర్ కాశీనాథ్, మెడికల్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విమలాథామస్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, కౌన్సిలర్ ఉన్నారు.

దొడ్డి కొమురయ్యను ఆదర్శంగా తీసుకోవాలి

- డీఆర్ఓ లక్ష్మీకిరణ్
- కలెక్టరేట్‌లో జయంతి వేడుకలు

సిద్దిపేటరూరల్: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం ప్రాణాలు అర్పించిన దొడ్డి కొమురయ్య జీవితం అందరికీ ఆదర్శమని జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మి కిరణ్ అన్నారు. దొడ్డి కొమరయ్య జయంతి సందర్భంగా సోమవారం బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో కొమురయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడు కొమురయ్య అని, వీరులు మరణించినా ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా ఉంటారని కొనియాడారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై దొడ్డి కొమురయ్య విగ్రహం పెట్టాలనే బీసీ సంఘాల వినతిని ఉన్నతాధికారులకు నివేదిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ బీసీ అభివృద్ధి జిల్లా అధికారి మురళీ, కలెక్టరేట్ ఏవో రెహమాన్, బీసీ సంఘాల నాయకులు ప్రభాకర్, మురళీకృష్ణ, ఉమేష్ యాదవ్, ఎల్లం, నరేందర్, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.



కొమురయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీ శ్వేత, అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్

తొలి అమరుడు కొమురయ్య: పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత

సిద్దిపేటకమాన్: తెలంగాణ రైతాంగ పోరాటంలో తొలి అమరుడు కొమురయ్య అని సీపీ శ్వేత అన్నారు. కమిషనర్ కార్యాలయంలో సోమవారం అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్‌తో కలిసి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. యువత ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ ఫణీందర్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ ఎదుట గ్రామస్తుల ధర్నా



ఆందోళన చేస్తున్న బండారుపల్లి గ్రామస్తులు

తొగుట(దుబ్బాక): విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయంటూ బండారుపల్లి గ్రామస్తులు మెట్టు సబ్‌స్టేషన్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. సబ్ స్టేషన్‌కు ఏడీఈ శ్రీనివాస్‌రావు, ఏఈ శ్రీనివాస్‌తో వాగ్వాదానికి దిగారు. బండారుపల్లి గ్రామ విద్యుత్ హెల్పర్ మహేందర్ విద్యుత్ షాక్‌కు గురైన విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడి చేరుకొని ఏడీఈని నిలదీశారు. అధికారుల నిర్లక్ష్యంతో గతంలో హెల్పర్ యాదగిరి మరణించాడని, పెద్ద మాసాన్‌పల్లి ఫీడర్ వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరెంట్ షాక్‌కు గురైన మహేందర్‌కు మెరుగైన వైద్యం అందించాలని, అతడి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న తొగుట ఎస్ఐ కర్ణాకర్‌రెడ్డి అక్కడి చేరుకొని గ్రామస్తులకు నచ్చజెప్పారు. సర్పంచ్ శారద, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గ్రామస్తులతో మాట్లాడారు. బాధిత కుటుంబాన్ని విద్యుత్ శాఖ తరపున ఆదుకుంటామని ఏడీఈ శ్రీనివాస్‌రావు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

గడువులోపు పన్ను చెల్లిస్తే రాయితీ

హుస్నాబాద్: 2023–24 సంవత్సరానికి గాను ఆస్తి పన్ను చెల్లింపులో 5శాతం రాయితీ అందిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. మార్చి 31 వరకు ఆస్తి పన్ను చెల్లించిన వారికి మాత్రమే 5శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. వినియోగదారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇప్పటివరకు 80శాతం పన్నులు వసూలు చేశామని ఆయన తెలిపారు. మున్సిపల్‌కు చెల్లించాల్సిన అన్ని రకాల పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి ప్రజలు సహకారం అందించాలని ఆయన కోరారు.

మూడోసారి బీఆర్‌ఎస్‌దే అధికారం

- ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, బోడకుంట వెంకటేశ్వర్లు
- కుకునూర్‌పల్లిలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): రాష్ట్రంలో మూడోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని, గజ్వేల్ గడ్డ.. కేసీఆర్ అడ్డా అని, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళన జిల్లా ఇన్‌చార్జి బోడకంటి వెంకటేశ్వర్లు అన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఎంపీపీ ఉపాధ్యక్షుడు దేవి రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో సుమారు 1500 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని మోదీ సర్కార్ జైలుకు పంపేందుకు ప్రయత్నిస్తుంటే పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి స్పందించడంలేదని, పైగా గజ్వేల్‌లో సభ నిర్వహిస్తామంటూ మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. కేంద్రం నుంచి జిల్లా అభివృద్ధికి నిధులు తీసుకురావడంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ విఫలమయ్యారని ఆరోపించారు. ఈడీ, ఐటీ దాడులతో ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు బీజేపీ ప్రయత్నం చేస్తోందని, ఈ విషయాన్ని బీఆర్‌ఎస్ కార్యకర్తలు ప్రజలకు వివరించాలని సూచించారు. యునెస్కో నుంచి దేశవ్యాప్తంగా 20 పథకాలు గుర్తింపు పొందితే, అందులో రెండు తెలంగాణ వేనని మర్చిపోవద్దన్నారు. సమావేశం ప్రారంభంలో కుకునూరుపల్లి మాజీ ఎంపీటీసీ పాల్కంపల్లి యాదగిరి మృతిపై రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, ఎంపీపీ ర్యాగల్ల సుగుణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎన్ఆర్‌ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పిస్క అమరేందర్, హౌజింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి, కొండపాక మండల అధ్యక్షుడు నూనె కుమార్, గజ్వేల్ ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు మల్లం ఐలయ్య, సర్పంచ్‌లు కోల శ్రీనివాస్, వసంత, కిరణ్‌కుమార్‌చారి, మహిపాల్, కందూరి కనుకవ్వ, మాజీ సర్పంచ్ కాచం నవీన్‌కుమార్, నాయకులు రమేష్‌రెడ్డి, శివ, మల్లేశం, ఐలయ్య, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న అనిల్‌కుమార్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): మృతదేహాన్ని తరలించేందుకు మున్సిపల్ వైస్ చైర్మన్ అనిల్‌కుమార్ రెడ్డి బాధిత కుటుంబీకులకు ఆర్థిక సాయం ప్రకటించారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొల్లారం మున్సిపల్ పరిధిలోని పోచమ్మ బస్తీలో నివాసం ఉంటున్న బీహార్‌కు చెందిన రింకుదేవి సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. మృతదేహాన్ని బీహార్‌కు తరలించేందుకు అనిల్‌కుమార్‌రెడ్డి రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు. దీంతో మృతురాలి కుటుంబ సభ్యులు అనిల్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు చెప్పారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ..శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 28 మంది పట్టుబడ్డారని, వారిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 25 మందికి రూ.2 వేలు చొప్పున, ఒకరికి రూ.3 వేలు, మరో ఇద్దరికి రూ.5వేలు జరిమానా విధించారన్నారు.

సిద్దిపేటకమాన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ సిబ్బందితో పట్టణంలోని ప్రధాన చౌరస్తాల్లో నాలుగు రోజుల క్రితం డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 19 మంది పట్టుబడ్డారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి వారికీ రూ.44వేల జరిమానా విధించారు.

ప్రమాద స్థలాలను గుర్తించాలి



వివరాలు సేకరిస్తున్న ఏసీపీ ఫణీందర్

నంగునూరు(సిద్దిపేట): రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నందునా ప్రమాద స్థలాలను గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలని సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ ఫణీందర్ ఎస్ఐ రాజుగౌడ్‌ను ఆదేశించారు. సోమవారం రాజగోపాల్‌పేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రోడ్డు ప్రమాదాలపై ఆరా తీశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న నేషనల్ హైవే పనుల గురించి వివరాలు తెలుసుకున్నారు. రోడ్లపై నిర్మిస్తున్న కల్వర్టుల వద్ద సూచిక బోర్డులు, రేడియమ్ స్టిక్కర్లు, స్టిక్కులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఏసీపీ సూచించారు.

నీటిలో మునిగి వ్యక్తి మృతి



విఘ్నేష్ (ఫైల్)

పాపన్నపేట(మెదక్): ప్రమాదవశాత్తు నీటిలో మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఏడుపాయల దేవస్థానం రెండో వంతెన సమీపంలో సోమవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన సకినాల విఘ్నేష్(33)వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం స్నేహితులతో ఏడుపాయలకు వచ్చాడు. రెండో వంతెన సమీపంలో చేతులు శుభ్రం చేసుకోవడానికి వెళ్లి నీటిలోకి జారి మునిగి పోయాడు. ఈ విషయాన్ని పోలీసులకు చేరవేయగా వారు అర్ధరాత్రి వరకూ గాలించి మృతదేహాన్ని బయటికి తీశారు. మృతుడి అన్న సందీప్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరళించినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

యాసంగిలో సోయాబీన్‌కే మొగ్గు

- పత్తి దెబ్బతినడంతో ప్రత్యామ్నాయంగా ఎంపిక
- నీటి తడులు తక్కువ
- మహారాష్ట్ర నుంచి విత్తనం కొనుగోలు

జహీరాబాద్: యాసంగిలో రైతులు సోయాబీన్ పంట సాగుకు ఆసక్తి చూపారు. జిల్లాలోనే జహీరాబాద్ ప్రాంతంలో అత్యధికంగా సాగులోకొచ్చింది. గతంలో రైతులు కేవలం వర్షాధార పంటగా వేసేవారు. ఈ ఏడాది అధికంగా వర్షాలు పడడంతో పత్తి పంట దెబ్బతింది. దీంతో ప్రత్యామ్నాయంగా ఈ పంటను ఎంపిక చేసుకున్నారు. కోహీర్, మొగుడంపల్లి, జహీరాబాద్, ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో పంట సాగయ్యింది. సుమారు 2వేల ఎకరాల్లో పంట వేసినట్లు అంచనా. సోయాబీన్‌లో కలుపు మొక్కలను తొలగించేందుకుగాను రసాయన మందులు అందుబాటులో ఉండడంతో సాగు సులువుగా ఉందని రైతులు పేర్కొంటున్నారు. నీటి తడులు అందించేందుకు గాను డ్రిప్ సదుపాయం ఉండడం కూడా రైతులు ఆవైపుగా మొగ్గు చూపారు. అధిక వర్షాలతో బోరుబావుల్లో నీరు సమృద్ధిగా చేరడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా సోయాబీన్ పంట సాగయింది. మార్కెట్లో మంచి ధర ఉండడం కూడా రైతులు ఆసక్తి చూపేందుకు కారణం.



చెరకులో అంతర పంటగా సోయాబీన్

మహారాష్ట్ర నుంచి విత్తనం కొనుగోలు

రైతులు అధికంగా మహారాష్ట్ర నుంచి విత్తనాలను కొనుగోలు చేసి తెచ్చుకున్నారు. అత్యధికంగా దిగుబడినిచ్చే రకాలను ఎంపిక చేసుకుని సాగు చేశారు. కొందరు రైతులు స్థానికంగా ఉన్న రైతుల వద్ద నుంచి తీసుకుని సాగు చేసుకున్నారు. ప్రస్తుతం పంటలు ఆశాజనకంగా ఉన్నట్లు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్న కంటే సోయాబీన్ పంటకు నీటి తడులు తక్కువే. కొండెంగలు, అడవి పందుల బెడద కూడా ఉండదనే ఉద్దేశంతో ఆసక్తి చూపినట్లు రైతులు చెప్పారు.

చెరకులో అంతర పంటగా..

చెరకు పంటను అంతర పంటగా కూడా రైతులు సోయాబీన్ పంటను సాగు చేశారు. నాలుగు ఫీట్ల నుంచి ఐదు ఫీట్ల వెడల్పు విధానంగా చెరకు పంటను నాటుకుంటున్నందునా మధ్యలో ఖాళీగా ఉండే ప్రదేశంలో సోయాబీన్ పంటను అంతర పంటగా వేసుకున్నారు. చెరకు అందించే నీటి తడులతోనే సోయాబీన్ పంట పండించుకుంటున్నారు. అదనపు ఖర్చు లేకుండానే పంటను పండిస్తున్నారు. చెరకు పంట పైకి ఎదిగివచ్చే వరకల్లా సోయాబీన్ పంట చేతికొస్తుంది.

పది ఎకరాల్లో పంట వేశాను



పది ఎకరాల్లో సోయాబీన్ సాగు చేశాను. మూడు ఎకరాల్లో చెరకులో అంతర పంటగా వేశాను. ఈ పంటకు పెట్టుబడులు తక్కువ. పంట కోతను యంత్రాలతో చేసే సదుపాయం ఉండడంతో సాగుపై ఆసక్తి చూపాను. నీటి తడులు సైతం అంతంత మాత్రంగానే అవసరం. మహారాష్ట్ర నుంచి కేడీఎస్ 753 రకం విత్తనాలను కొనుగోలు చేశాను.

– మల్లికార్జున్‌రెడ్డి, రైతు, ధనాసిరి

పెట్టుబడులు తక్కువ



సోయాబీన్ పంట సాగుకు పెట్టుబడి ఖర్చు తక్కువ. యాసంగిలో సోయాబీన్ పంటను సాగు చేశా. నాలుగు ఎకరాల్లో పంట వేసుకున్నాను. పంటకు అడవి జంతువుల బెడద కూడా ఉండదనే ఉద్దేశంతో ఆసక్తి చూపాను.

– సుదర్శన్‌రెడ్డి, రైతు, గుడ్‌పల్లి

సాగుచేయడం ఎంతో సౌలభ్యం



యాసంగిలో సోయాబీన్ పంట సాగు చేయడం ఎంతో సౌలభ్యంగా ఉంటుందనే ఉద్దేశంతో రైతులు ఆసక్తి చూపారు. మొగుడంపల్లి మండలంలో వంద ఎకరాలకు పైగా రైతులు పంట సాగు చేసుకున్నారు. మొక్కజొన్న పంటకు అడవి పందుల బెడద, కొండెంగల బెడద ఉండడంతో సోయాబీన్ పంట వైపు మొగ్గు చూపారు. కొందరు రైతులు చెరకు పంటలో కూడా అంతర పంటగా సోయాబీన్ సాగు చేసుకున్నారు. ప్రస్తుతం పంట సాగు ఆశాజనకంగా ఉంది.

– వినోద్‌కుమార్, ఏఓ, మొగుడంపల్లి

విద్యుదాఘాతంతో హెల్పర్‌కు తీవ్రగాయాలు

- ఉస్మానియా ఆస్పత్రికి తరలింపు
- సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఘటన

తొగుట(దుబ్బాక): విద్యుదాఘాతంతో హెల్పర్ తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని బండారుపల్లి మదిర మెట్టు వద్ద సోమవారం ఉదయం చోటు చేసుకుంది. మెట్టు సబ్ స్టేషన్ సమీపంలో జంపర్ వేయాలంటూ తీసుకొచ్చిన సిబ్బంది కరెంట్ సరఫరా నిలిపేయకుండా స్తంభం ఎక్కించారు. దీంతో విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బుచ్చక్క మహేందర్ (40) కొన్ని సంవత్సరాలుగా గ్రామ హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో పెద్ద మాసాన్‌పల్లి ఫీడర్‌కు కరెంటు సరఫరా నిలిచిపోయింది. అక్కడ జంపర్ వేయాలంటూ జూనియర్ లైన్ మెన్ నర్సింలు అతణ్ని మెట్టు వద్దకు తీసుకొచ్చాడు. జూనియర్‌లైన్ మెన్ అతన్ని పురమాయించాడు. కరెంట్ సరఫరాను నిలిపివేశామని చెప్పడంతో మహేందర్ స్తభం ఎక్కి సరిచేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ ఘాతానికి గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. అక్కడే ఉన్న సిబ్బంది వెంటనే కరెంట్ సరఫరాను నిలిపివేశారు. చుట్టు పక్కల వారు ట్రాక్టర్ తీసుకొచ్చి హైడ్రాలిక్‌తో లేపి స్తభం పైనుంచి మహేందర్‌ను కిందకు దించారు. తీవ్రంగా గాయపడిన అయన్ను చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించాలని వైద్యులు సూచించారు. దీంతో అతన్ని ఉస్మానియాకు తరలించి చికిత్స అందిస్తున్నారు. సర్పంచ్ శారదారఘోత్తంరెడ్డి మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి ఈ విషయంపై సమాచారం చేరవేశాడు. దీంతో వెంటనే స్పందించిన ఎంపీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.



మహేందర్‌ను కిందకు దించుతున్న దృశ్యం

విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం

సిబ్బంది నిర్లక్ష్యంతోనే పెద్ద మాసాన్‌పల్లి ఫీడర్‌లో కొద్ది రోజుల క్రితం యువకుడు కరెంట్ షాకుతో మరణించాడు. ఈ మండలంలో వరుస ప్రమాదాలు జరుగుతున్నా విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఎమ్మెల్యేపై కేసు..

ముందుకు సాగని చార్జిషీట్
డీఎస్పీపై చర్యలు తీసుకోవాలి

పటాన్‌చెరు: తనను బెదిరించి హత్య చేస్తానన్న ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేసి నేటికీ చార్జ్‌షీట్ దాఖలు చేయలేదని జిల్లా ఎస్పీనకు బాధితుడు సంతోష్‌నాయక్ ఫిర్యాదు చేశారు. పటాన్‌చెరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 8, 2020లో అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు. కానీ, నేటికీ ఆ చార్జ్‌షీట్ దాఖలు చేయలేదన్నారు. తాను జర్నలిస్టుగా పని చేసిన సమయంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తనను దూషించారని, చంపుతానని బెదిరించారని ఈ నేపథ్యంలో తాను ఎమ్మెల్యేపై కేసు పెట్టినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు అయ్యిందని సంతోష్‌నాయక్ పేర్కొన్నారు. అయితే విచారణాధికారిగా డీఎస్పీ భీమ్‌రెడ్డి నేటికీ చార్జ్‌షీట్ వేయలేదన్నారు. సాధారణంగా రెండున్నర నెలల్లోనే ఆ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ విచారణాధికారి నిర్లక్ష్యంతోనే తనకు న్యాయం జరుగలేదన్నారు. విచారణాధికారిగా డీఎస్పీని తప్పించి వేరే వారిని నియమించాలని సంతోష్‌నాయక్ ఎస్పీతో చెప్పారు.

బ్యాంక్ అధికారులమంటూ టోకరా

సిద్దిపేటకమాన్: బ్యాంకు అధికారులమంటూ ఫోన్ చేసి ఓ అమాయకుడి ఖాతా నుంచి డబ్బులు కాజేసిన సంఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట వన్ టౌన్ సీఐ భిక్షపతి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి బ్యాంక్ అధికారులమంటూ పరిచయం చేసుకున్నాడు. మీ ఖాతా కేవైసీ అప్‌డేట్ చేయాలి లేదంటే మీ ఖాతాలో డబ్బులు జమ, విత్‌డ్రా చేయలేరని నమ్మబలికారు. దీంతో బాధితుడు మొబైల్‌కు వచ్చిన ఓటీపీ వివరాలు గుర్తుతెలియని వ్యక్తికి తెలిపాడు. వెంటనే అతని ఖాతా నుంచి రూ.29,998 డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో సైబర్ మోసం జరిగినట్లు గుర్తించి బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫిర్యాదు చేశాడు.

రూ. 10లక్షలు మంజూరైందంటూ...

పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి ఆన్‌లైన్లో మీకు రూ.10లక్షల లోన్ మంజూరైందని, ప్రాసెసింగ్ చార్జీల నిమిత్తం కొంత మొత్తం డబ్బులు చెల్లించాలని గుర్తు తెలియని వ్యక్తి తెలిపాడు. అది నమ్మిన బాధితుడు గుర్తు తెలియని వ్యక్తి సూచించిన ఖాతాకు ఆన్‌లైన్‌లో రూ.8,550లు పంపాడు. కొంత సమయం తరువాత తాను మోసపోయినట్టు గ్రహించి జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫిర్యాదు చేశాడు.

అంగన్‌వాడీలో దొంగలు పడ్డారు!

15 నూనె ప్యాకెట్లు, 20కిలోల కంది పప్పు అపహరణ

అక్కన్నపేట(హుస్నాబాద్): ఓ అంగన్‌వాడీ కేంద్రంలో దొంగలు పడ్డారు. ఈ సంఘటన అక్కన్నపేట మండలం కేశవాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. సర్పంచ్ బొమ్మగానీ రాజేశం తెలిపిన వివరాల ప్రకారం...గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు పడ్డారని చెప్పారు. తెల్లవారుజామున సోమవారం అంగన్‌వాడీ టీచర్, సిబ్బంది వెళ్లే సరికి తలుపులు తెరిచి ఉన్నట్లు గుర్తించి లోపలికి వెళ్లి చూసే సరికి 15 నూనె ప్యాకెట్లు, సుమారు 20కిలోల కంది పప్పు దొంగతనం జరిగినట్లు అంగన్‌వాడీ సిబ్బంది గుర్తించి సర్పంచ్‌కి తెలిపారు. ఈ వియంపై ఎస్సై తాండ్ర వివేక్‌ను సంప్రదించగా తమ దృష్టికి రాలేదన్నారు.

బెట్టింగ్‌లకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

రెండు సెల్‌ఫోన్లు, నగదు స్వాధీనం

పటాన్‌చెరు టౌన్: ఐపీఎల్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి రెండు సెల్‌ఫోన్లు, రెండు నోట్ పుస్తకాలతో పాటు నగదు స్వాధీనం చేసుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులు రెడ్డి సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. బీరంగూడలోని షిరిడీ సాయి కాలనీలో జగదీష్ అనే వ్యక్తి ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడని ఆదివారం రాత్రి సమాచారం రావడంతో ఎస్ఐ సుభాష్‌తో పాటు సిబ్బంది నిందితుని ఇంటికి వెళ్లారు. తన సెల్‌ఫోన్లో బెట్టింగ్ నిర్వహిస్తుండగా అతణ్ని అదుపులోకి తీసుకున్నారు. ఫోన్ ద్వార పంటర్స్ దగ్గర డబ్బులు తీసుకొని ఈ తంతు నిర్వహిస్తున్నట్లు విచారణలో ఒప్పుకున్నాడు. తన వద్ద బెట్టింగ్‌కు సంబంధించిన సెల్ ఫోన్లు, రూ.7,40,500లతో పాటు రెండు లాంగ్ నోట్ బుక్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసులు రెడ్డి

పంట నష్టం చేసిన వ్యక్తికి మూడు నెలల జైలు

రూ. వెయ్యి జరిమానా

ఝరాసంగం(జహీరాబాద్): పంట నష్టం చేసిన వ్యక్తికి 3 నెలల జైలు శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధించిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మునిపల్లి మండల పరిధిలోని తాటిపల్లి గ్రామానికి చెందిన అల్లం శ్రీనివాస్ రెడ్డి జూన్ 18, 2017న ఝరాసంగం మండల పరిధిలోని ప్యారవరం గ్రామ శివారులోని పట్లోళ్ల వీరన్న వ్యవసాయ భూమిలో అక్రమంగా ప్రవేశించి, పంటను దున్నేసి, పంట నష్టం చేసి బెదిరించాడు. దీంతో ఝరాసంగం పోలీస్ స్టేషన్‌లో పట్లోళ్ల వీరన్న ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో అప్పటి ఎస్ఐ లవకుమార్ కేసు నమోదు చేసి చార్జి షీటు ధాఖలు చేశారు. జహీరాబాద్ కోర్టు జడ్జి జి.అనుష కేసు వివరాలు పరిశీలించి సోమవారం నిందితుడు అల్లం శ్రీనివాస్‌రెడ్డికి 3నెలల జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించినట్లు ఎస్ఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు.

ఎంకేపల్లిలో కార్డన్ సెర్చ్

పాపన్నపేట(మెదక్): మండలంలోని ఎంకేపల్లిలో సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. మెదక్ రూరల్ సీఐ విజయ్ తెలిపిన వివరాల ప్రకారం..సెర్చ్‌లో భాగంగా వాహనదారుల ఆధార్ కార్డులు, డ్రైవింగ్ లైసెన్సు, ఇతర గుర్తింపు కార్డులను పరిశీలించామన్నారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్న వారి వాహనాలను సీజ్‌చేసినట్టు చెప్పారు. ఈ తనిఖీలో 30 బైకులు, రెండు ఆటోలు, ఒక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. సంబంధిత పత్రాలను చూపించి తమతమ వాహనాలను తీసుకెళ్లాలని గ్రామస్తులకు ఆయన తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు శేఖర్, శ్రీనివాస్‌గౌడ్, మోహన్‌రెడ్డి, 40 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురి మృతి

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. లారీ ఢీ కొని రేగోడ్‌లో ఒకరు, పటాన్‌చెరు టౌన్‌లో ఇంకొకరు మృతి చెందారు. ఆటో బోల్తాకొట్టిన ఘటనలో ఏఎన్ఎం కమల, ఇంటర్ పరీక్షలకై బైక్‌పై వెళ్తూ బస్సును ఢీ కొన్న ఘటనలో బొల్లారానికి చెందిన దినేష్ మృత్యువాత పడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఏఎన్ఎం...



కమల మృతదేహం

జోగిపేట(అందోల్): రోడ్డు ప్రమాదంలో ఏఎన్ఎం మరణించిన సంఘటన జోగిపేటలో జరిగింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్మాయిపేట సబ్‌సెంటర్లో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న కమల తాలెల్మ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీపీఆర్ శిక్షణకు హాజరై తిరిగి ఆటోలో వెళ్తుండగా అది పల్టీ కొట్టింది. ముందు సీటులో కూర్చున్న ఆమె కిందపడిపోగానే ఆటోలో ఉన్న వారంతా ఆమెపై పడిపోయారు. ఈ ఘటనలో ఆమె మూతికి, కడుపు వద్ద బలమైన గాయాలయ్యాయి. కొన ఊపిరితో ఉన్న ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందించేలోపే మృతి చెందినట్లుగా ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. ఆటోలో ప్రయాణించిన ఆశ కార్యకర్తలకు స్వల్ప గాయాలయ్యాయి. ఆశ కార్యకర్త భర్త వట్‌పల్లికి చెందిన శివశంకర్ కాలు విరిగిపోవడంతో మెరుగైన చికిత్స నిమిత్తం సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు జోగిపేట పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని రేగోడ్‌లో..



నాగరాజు మృతదేహం

రేగోడ్(మెదక్): లారీ ఢీ కొట్టడంతో ఒకరు మృతిచెందిన సంఘటన టి లింగంపల్లి వద్ద సోమవారం జరిగింది. ఏఎస్ఐ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం..పెద్దశంకరంపేట మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన బి.నాగరాజు (34) రేగోడ్ మండలంలోని గజ్వాడ సబ్‌స్టేషన్లో ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా వెనుకనుంచి లారీ ఢీ కొట్టింది. కిందపడిన నాగరాజును చికిత్స నిమిత్తం తరలిస్తుండగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి జనార్దన్ ఇచ్చిన ఫిర్యాదు మెరకు ఏఎస్ఐ మల్లయ్య కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న విద్యార్థి...

సిద్దిపేటకమాన్: మిత్రులతో కలిసి పరీక్ష రాయడానికి బైక్‌పై వెలుతూ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఇంటర్మీడియట్ విద్యార్థి మృతి చెందాడు. సిద్దిపేట టూటౌన్ సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన బొల్లారం దినేష్ (19) పట్టణంలోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అతడు పరీక్షా కేంద్రానికి మిత్రులతో బైక్‌పై హాజరవుతున్నాడు. రోజు మాదిరిగానే గత నెల 29న రంజిత్, రాజులతో పరీక్షకు వెళ్లే క్రమంలో ఆర్టీసీ బస్సు ఎలాంటి సూచికలు లేకుండా ఒక్కసారిగా బ్రేకులు వేయడంతో విద్యార్థులు ప్రయాణిస్తున్న బైక్ బస్సును ఢీకొట్టింది. దీంతో కింద పడిన విద్యార్థులకు గాయాలయ్యాయి. వెంటనే గాయపడిన వారిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు దినేష్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైద్రాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అక్కడ దినేష్ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి బాబాయి శేఖర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లారీ ఢీ కొని వ్యక్తి..

పటాన్‌చెరు టౌన్: లారీ ఢీ కొని వ్యక్తికి తీవ్ర గాయాలై సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ప్రసాద్ రావు తెలిపిన వివరాల ప్రకారం...పటాన్‌చెరు మండలం ముత్తంగి చర్చి సమీపంలో ఆదివారం రాత్రి జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న వ్యక్తి పటాన్‌చెరు వైపు నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో గుర్తుతెలియని వ్యక్తి కి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆ వ్యక్తి మృతిచెందాడు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు పటాన్‌చెరు పోలీసులను సంప్రదించాలని తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పొలంలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

విద్యార్థులకు స్వల్పగాయాలు

కోహెడ(హుస్నాబాద్): శనిగరం రోడ్డు కోహెడ నల్లాల బాయి వద్ద సెయింట్ విన్‌సెంట్ పల్లోటి హైస్కూల్‌కు చెందిన బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన వ్యవసాయ పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. బెజ్జంకి మండలం రేగులపల్లిలోని సెయింట్ విన్‌సెంట్ పల్లోటి హైస్కూల్ నుంచి బస్సు డ్రైవర్ కల్లెపల్లి రాజశేఖర్(25) కోహెడకు తీసుకోస్తున్నక్రమంలో కోహెడ నల్లాల బావి సమీపంలో బస్సు అదుపుతప్పింది. రోడ్డు పక్కనే పొలంలోకి దూసుకెళ్లింది. స్కూల్ బస్సు వెనకాలనే ద్విచక్ర వాహనంపై కోహెడకు వస్తున్న తంగాళ్లపల్లికి చెందిన కత్తి సతీశ్, బెజ్జంకి మండలం తిమ్మాయపల్లికి చెందిన దనబోయిన రాజు బస్సు నుంచి విద్యార్థులను ఒకొక్కరిని సురక్షితంగా బయటకు తీశారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు ఆందోళనతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యంతోనే బస్సు అదుపు తప్పిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. రెండు గంటల తర్వాత యాజమాన్యం సంఘటన స్థలానికి చేరుకోవడంతో అనుభవం లేని డ్రైవర్లను నియమించటంపై ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని విద్యార్థుల తల్లితండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఈఓ పావని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సంఘటనకు సంబంధించిన వివరాలను ఆమె నమోదు చేశారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆమె హామీ ఇచ్చారు. డీప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, ఆర్ఐ హరీశ్, పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించారు. కాగా జరిగిన ఘటనలో చాకచక్యంగా విద్యార్థులను కాపడిన రాజు, సతీశ్‌లను బీజేపీ నాయకులు శాలువకప్పి సన్మానించారు. సంఘటన పట్ల స్కూల్ యాజమాన్యం, డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



పొలంలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

ప్రభుత్వ ఆస్పత్రిలో కేంద్ర బృందం తనిఖీ

సంగారెడ్డి మున్సిపాలిటీ: ప్రభుత్వం చేపట్టిన లక్ష కార్యక్రమంలో భాగంగా సోమవారం సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో కేంద్ర బృందం తనిఖీలు నిర్వహించారు. ఆస్పత్రిలో జరుగుతున్న వ్యవహారాలపై రికార్డులను పరిశీలించి, అక్కడ పనిచేసే సిబ్బందితో వివరాలు సేకరించారు. ఈ తనిఖీలు మంగళవారం కూడా నిర్వహించనున్నట్లు తనిఖీ బృందం సీతుశర్మ, అరుల్మహజిలు తెలిపారు. వారి వెంట జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్, ఆర్ఎంవోలు రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

వైన్స్ వద్ద మహిళ అనుమానాస్పద మృతి



సుశీల మృతదేహం

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ పాత బస్టాండ్ సమీపంలో గల వైన్స్ వద్ద ఓ మహిళ అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. మెదక్ పట్టణ పోలీసుల వివరాల ప్రకారం..నర్సాపూర్ పట్టణానికి చెందిన గూని సుశీల(56)మెదక్ పాత బస్టాండ్ సమీపంలో గల వైన్స్ వద్ద అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. మృతురాలి భర్త మల్లేశం ఏడు సంవత్సరాల క్రితం మరణించగా ఆమె మద్యానికి బానిసైనట్లు తెలిపారు. 2న దారువాల వైన్స్ వద్ద మద్యం సేవించి అక్కడే చనిపోయినట్లు తెలిపారు.

దాడికి పాల్పడిన ఘటనలో జైలు

సిద్దిపేటఅర్బన్: పాత ఇనుప సామాను కోసం వెళ్లిన దంపతులతో పాటు వృద్ధుడిపై దాడి చేసిన ఘటనలో జైలు వార్డర్‌పై సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయ్యింది. ఎన్సాన్‌పల్లిలో ప్రభుత్వం జిల్లా జైలు నిర్మాణానికి స్థలం కేటాయించింది. స్థల పర్యవేక్షణకు జైలు అధికారులు సిబ్బందిని నియమించారు. కాల్వ నిర్మాణానికి సామాగ్రి పెట్టుకోవడానికి మెగా కంపెనీ వారు సంబంధిత స్థలాన్ని వినియోగించుకున్నారు. దీంతో అక్కడ మిగిలిపోయిన ఇనుప సామాను ముక్కలు ఏరుకోవడానికి తిప్పరబోయిన ఎల్లయ్య, మణెమ్మ దంపతులతో పాటు మరో వృద్ధుడు నర్సయ్య ఆదివారం అక్కడికి వెళ్లారు. అక్కడ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ దుర్గచరణ్‌రెడ్డి వారిని అడ్డుకొని అక్కడికి రావద్దని హెచ్చరించారు. వారు ఇనుప సామాను కోసం వచ్చినట్టు చెప్పినా వినకుండా వారిని లాఠీతో ఇష్టానుసారంగా కొట్టాడు. జైలు వార్డర్‌పై కేసు నమోదు చేసినట్టు సీఐ భానుప్రకాష్ తెలిపారు.